గోతిలో పడనున్నవారెవరో!

'భగవాన్ దాస్'

—(౧)—

శారద జీవితము అలా తారుమారగుతుందని ఎవరూ అనుకోలేదు. మంచి తెలివితేటలతో స్కూలు ఫైనలు దాక చదువుకున్నది. రంగనాథం, ఆమె పెద్ద కూతురు కావడంవల్ల మోజుకొద్దీ అల్లారుముద్దుగా పెంచి మంచి సంబంధముచూచి కట్నకానుకలతో వివాహంచేయ తలపెట్టాడు. కాని తానొకటి తలచితే దైవమొకటి చేసినట్లు పెండ్లికి తన స్థిమితానికి మించిన ఖర్చయిందేకాని శారదకు మాత్రము సుఖ సౌభాగ్యాలు సమకూరలేదు.

రంగనాథం అనుభవం చాలక దళారుల మాటవిని నాలుగువేల రూపాయల కట్నకానుకలిచ్చి ధనధాన్య సంపదలుగల యింట్లో కూతురు సుఖపడుతుందని శారదను రామారావుకు యిచ్చి వివాహం చేశాడు. తీరా పెళ్లయిన తరువాత చూస్తే లోన లొటారం, పైన బటారంగా కనుపించినవి రాఘవయ్యగారి కుటుంబ పరిస్థితులు. రాఘవయ్యగారి ఆస్తిపాస్తులను గురించి తాను విన్నదానికి, తర్వాత రుజువయిన దానికి హస్తిమశకాంతమంత భేదం కనుపించింది. అల్లుడు దండయాత్రలలో గజనీమహమ్మదును మరపిస్తూ ఎలాగైతేనేం స్కూలుఫైనలు ప్యాసయి, స్కూలుమాష్టరు ట్రెయినింగ్ అయ్యాడు. చిన్నకొడుకులు ముగ్గురు యించుమించుగా దండయాత్రలలో అన్నయ్యతో సరితూగుతూ చదువుతున్నారు. రాఘవయ్యకున్నది కొద్దైతే లేనిఘనతను తెచ్చిపెట్టుకుని పరవళ్లు త్రొక్కుతుండేవాడు. ఆడపిల్లలకు మాత్రం ఏదో విధంగా పెండ్లి చేసి అత్తవారిండ్లకు కాపరానికి పంపించాడు. రామారావుకు చదువు సంధ్య లెట్లున్నా లోకజ్ఞానంగాని, స్వీయ బాధ్యతలుగాని, ఉత్తమమైన నైతిక స్థాయిగాని తెలియవు. 'ఇంట్లో యీగల మోత, బయట పల్లకీల మోత' అన్నట్లు రాఘవయ్యగారి ఆర్భాటం. పరవళ్ళు మాత్రం చెప్ప శక్యమయ్యేవి కావు. ప్రతియొక్కరిని వ్యాఖ్యానిస్తూ, విద్దేవ చేస్తుండేవాడు. రంగనాథం పొరబడి రాఘవయ్యతో సంబంధము చేయడం చూచి ఆ యూళ్లో అనేకులు "ఈ మాత్రము సంబంధము దొరకక కాబోలు యింత కట్నకానుకలిచ్చి చేశాడు పిచ్చిబ్రాహ్మడు" అనుకున్నాడు.

శారద తెలివితేటలకు, ఆమెకు చదువు పట్లయుండిన శ్రద్ధాసక్తులకు పెండ్లికని ఖర్చుచేసిన నాలుగయిదు వేలరూపాయ

లలో ఉన్నతవిద్య చెప్పించినా అమ్మాయికి కష్టాలుండేవికావు; రంగనాధంకు మానసిక వ్యథ యుండేదికాదు.

రామారావు ఆ యూళ్ళోనే ఎలిమెంటరీ స్కూలులో పనిచేస్తూ వచ్చినది వచ్చినట్లు జీతాన్ని రాఘవయ్య దోసిట్లో పోసేవాడు. తనకు కానిడబ్బు కావలసినా తండ్రినడుగాలి. అడిగితే ఒక మాత్రాన రాగిదమ్మిడి సయితం యిచ్చేవాడుకాడు రాఘవయ్య. శారద కాపరానికి పోయేంతవరకు తండ్రికొడుకుల కుమ్ములాటలో ఎలాగో జరిగిపోయింది. రాఘవయ్య యింట్లో జరుగుబాటును గమనించకుండా నెలకు యిరవై రోజులు ఆ వూరు, యీ వూరు కోర్టుపనులకని తిరుగుతుండేవాడు. అయిదారుగురు తిన, కుడువయున్న సంసారంలో జరుగుబాటుకు పండివచ్చిన ధాన్యమును యింట్లో చిన్న, పెద్దకూడ కొట్లకు పోయాల్సి వచ్చేది. అందుకని సంవత్సరానికని అట్టే బెట్టిన ధాన్యము ఆరు నెలలకే అయిపోవడం, తర్వాత యితర నిత్యావసరవస్తువులతో బాటు బియ్యానికి సయితము అలమటించడము సహజమయిపోయింది. శారద కాపురానికి వచ్చిన క్రొత్తల్లో ఆమెకిదంతా అయోమయంగా తోచింది. కోడలు వచ్చిన తరువాత అయినా రాఘవయ్య ధోరణి, యింటిపరిస్థితులు చక్కబడ్డ పాపాన పోలేదు సరిగదా మరింత ఎక్కువగా వెర్రితలలు వేసినవి.

శారద కాపరానికి వచ్చినప్పటినుండి నల్లనిదని, ఇంట్లో అడుగుపెట్టినప్పటినుండి దరిద్రం చుట్టుకున్నదని, బహిరంగంగా రాఘవయ్య పదం పాడసాగాడు. ఇంట్లో ఎవరికి ఏ కొద్ది జబ్బు చేసినా 'యిది మా కోడలు యింట్లో అడుగు బెట్టిన వేళా విశేష'మనేవాడు. ఆ వేళకు, యీ వేళకు తినే నాలుగు మెతుకులు తప్ప శారదకా యింట్లో అచ్చట్లు, ముచ్చట్లంటూ లేక పోగా తల దువ్వి జడ వేసుకోడానికి కొబ్బరి నూనెకు సయితం ఆ యింట్లో ఎప్పటికప్పుడు కరువే. ముచ్చటగా ముత్తైదు ఆడపిల్లకు అణా డబ్బులకు పూలు కొనిపెట్టడానికి ఏనాడూ చేతులురావు రాఘవయ్యకు. తన దలచుకొని ఏదైనా బజారునుండి తెప్పించుకుందామన్నా మామగారి స్తేగా తనకైనా, తన భర్తకైనా డబ్బులంటూ! అప్పటికీ రామారావు చాటుమాటుగా వూళ్ళో అప్పో, సప్పో చేసి శారదకు ఏదైనా కొని తెచ్చిపెడితే రాఘవయ్య బజారుకుపోయి "మా వాడికి అప్పియ్యవాకండి; యిస్తే వసూలు చేసికోవాల్సిన బాధ్యత పూర్తిగా మీదే" నని చెప్పి వచ్చేవాడు.

రాఘవయ్య శారదనుచూచి ఎప్పుడూ రుసరుస లాడుతుండేవాడు. కోడలు, కొడుకు కలసి మాట్లాడుకోడాన్ని రెండు

కళ్ళతో చూచి ఓర్వ్వకలిగేవాడు కాడు. రామారావును యింట్లో ఒక్క క్షణమైనా నిలువనీయక ఎప్పుడూ బయట తిరుగమనే వాడు. ఎంత వినయంగా, ఒద్దికగా, పని పాటలలో మెలకువగానున్నా ఏదో సాకుతో కసురుతూనో, సూటిపోటీ మాటలంటూనో, శారద పుట్టింటివాళ్లు సైకిలిస్తామని, చేతిగడియారమిస్తామని, యివ్వలేదనే నిందలతో, దెప్పిళ్ళతో రచ్చచేస్తుండేవాడు. ఇదంతా చూస్తూన్న శారద తనిలా ఎంత కాలం యమచరపడగలనా! యని ఆలోచిస్తుండేది.

తను నెలకు డెబ్భైరూపాయలు సంపాదిస్తూ తనయొక్క, భార్యయొక్క అవసరాలకు అప్పులు చేయడమేమిటి! వచ్చిన జీతాన్ని తండ్రి గుంజేసుకుంటుంటే అప్పులు తీరక నలుగురి నోళ్ళలో నానడమేమిటూ యని ఆలోచించి తమ ఖర్చులకు తన జీతంలో నెలకు కనీసం 15 రూపాయలైనా తీసికుంటానన్నాడు. అలా వీలుకాదంటే కాదన్నాడు రాఘవయ్య. జీతం మొత్తం తనకివ్వకపోతే యింట్లో కాదుకదా, ఆ యూళ్ళో కూడ నుండటానికి వీలు కాదన్నాడు. దాంతోటి రామారావు బడికి పోవడం మానేశాడు. రాఘవయ్య ఒకటి రెండు సార్లు కొడుకు, కోడలిని బెదిరించాడు. ఏదెట్లైనా సరే తన అవసరాలకు కొంతానికి కొంచమైనా వినియోగపడని సంపాదనతో తనకు నిమిత్తము లేదని బిర్ర బిగుసుక కూర్చున్నాడు రామారావు. తన మాటను లక్ష్యము చేయలేదనే కచ్చతో స్కూలులో ఉద్యోగమునుండి తొలగింప జేశాడు రామారావును. మొదలే ముక్కిడి, ఆ పైన పడిశమన్నట్లూ సంపాదిస్తున్న రోజులలోనే రచ్చ, రద్దితో ఆ యింట్లో జీవనం గడుస్తుంటే యిక ఉద్యోగం, సద్యోగం లేకుండా కూర్చొనిస్తాడా రాఘవయ్య కొడుకును! భార్యాభర్తలిద్దరు ఆ యింట్లో నుండలేకపోయారు. మరెక్కడైనా జీవనోపాధి కల్పించుకుందామని ఆ యిల్లు వదలి బయలుదేరారు. శారదను పుట్టింటికి పంపి, రామారావు ఉద్యోగాన్వేషణ మొదలుపెట్టాడు. అప్పటినుండి కుటుంబం ఆస్తి నుండి రామారావుకు ఏ మాత్రం దక్కకుండా చేయాలని నిశ్చయించుకున్నాడు రాఘవయ్య.

రాఘవయ్యగారి యింట్లో పరిస్థితులను, పరిణామాలను గురించి విని రంగనాథం దంపతులు నిర్విణ్ణులయినారు. తన కూతురు కాగతి పట్టినందుకు రంగనాథం తనే కారణమని పశ్చాత్తాప పడ్డాడు. రాఘవయ్యకు ఆ యూళ్ళోని పెద్దలచే న్యాయం, ధర్మం చెప్పిద్దామంటే • రాఘవయ్య వినేవాడుగా కనుపించలేదు. ఇకముందేం

జరుగాలనాయని మథనపడసాగారు రంగనాథం దంపతులు.

రామారావుకు ప్రక్క జిల్లాలో నొక చోట ఉద్యోగం దొరికింది. నెలకు ఎనభై రూపాయల జీతంతో బాటు, మరొక ఎనభై రూపాయల ఆదాయం సమకూర్చగల ప్రైవేటు ట్యూషన్‌లు దొరకినవి. శారదను పిలుచుకొనివచ్చి కాపరం పెట్టాడు. వచ్చే ఆదాయంతో చీకుచింతా లేకుండా భార్యాభర్తలు జీవయాత్ర చేయడానికి అవకాశాలు ఏర్పడినా వానిని వినియోగించుకోడానికి యోగ్యతలు లేకపోయినవి రామారావుకు.

కొంతకాలం సంసారం ఏగొడవలు లేకుండ సౌమ్యంగానే గడచింది. తర్వాత క్రమంగా తనకు పెళ్లిలో యిస్తానన్న సైకిలు చేతిగడియారం మామగారింకా యివ్వలేదని రామారావు శారదమీద రుసరుసలాడసాగాడు. తండ్రికి జాబువ్రాసి తెప్పించి పెట్టమనీ హంగామా మొదలు పెట్టాడు. శారద తనకు వానిని గురించి తెలియదు కాబట్టి ఆయన్నే వ్రాసియో, అడిగో తెప్పించుకోమన్నది.

అసలే రాఘవయ్య అయోగ్యతకు, వారి అయోమయ కుటుంబ పరిస్థితులకు విచారపడుతూ తల్లిదండ్రులు ముందు ముందు తన గతి ఏమికానున్నదాయని ఆందోళన పడుతుంటే 'మా వారికి గడియారం, సైకిలి కొనిపెట్ట'మని ఎలా అడుగుతుంది శారద మాత్రం! ప్రతి రోజు శారదను తండ్రికి జాబు వ్రాయమని రచ్చ. క్రమంగా యిద్దరు కొట్టుకోడమల్లాపోయి రామారావు కొట్టి, తిట్టి బెదిరించ సాహసించాడు. అప్పుడు శారద తండ్రికి జాబువ్రాస్తే విశ్వనాథం ఏదో మునిగిపోతున్నట్లు కంగారుగా వచ్చాడు. రామారావు ఎదటికివచ్చిన మామగారిని సైకిలు, గడియారం అడుగడానికి బదులుగా "శారదను మీ వెంట పిలుచుకెళ్లండి; నేనైనా యీ యుద్యోగం ఎంతకాలంచేస్తానో చెప్పలేకున్నాను" అన్నాడు. శారద పుట్టెడు దుఃఖంతో, విరక్తితో తండ్రివెంట పోవడానికి ప్రయాణమయింది. రంగనాథం ఎంతగానో ఆలోచించి పోనీ కొంతకాలంపాటు తమ దగ్గర ఉండి వస్తుందిలే అని శారదను పిలుచుకొని పోయారు.

తర్వాత మూడురోజులకు సునాయాసంగా ఉద్యోగానికి రాజీనామాయిచ్చి రైలెక్కి రామారావు స్వగ్రామానికి యిల్లుచేరాడు. ఎప్పుడు అవకాశం చిక్కుతుందాయని ఎదురుచూస్తున్న రాఘవయ్య రామారావు పట్ల లేని ఆదరాభిమానములను తెచ్చిపెట్టుకొని, ఆ మాట, యీ మాట తీయగాచెప్పి, తల్లిచేత చెప్పించి కుటుంబం ఆస్తికి, తనకు ఎలాటి సంబంధము లేనట్లుగా రామారావు

చేత స్వదస్తూరితో కాగితం వ్రాయించుకున్నాడు. తనకు కావలసినపని అయింది. ఇక యథాప్రకారము మంగళ హారతులు, స్వస్తి ప్రారంభమయినవి. చిన్న కొడుకులను ప్రయోగించి రామారావును యిల్లు వెడలకొట్టించాడు.

ఈ విషయం తెలిసి రంగనాథం దంపతులకు హృదయం నీరయింది. ఏమిచేయాలో తోచలేదు. రామారావు దేశద్రిమ్మరై ఎక్కడ తిరుగుతున్నాడో అంతులేదు. శారదను ట్రైనింగుకు పంపి ఆ యూళ్ళోనే హైస్కూలులో టీచరుగా ఉద్యోగం సంపాదించారు.

రాఘవయ్యకు కోడలేమయిందో, కొడుకేమయినాడో అనే విచారమేలేదు. పానకాలరాయుడులాగ కట్నకానుకలను, కుటుంబ ఆస్తిలోని కొడుకు వాటాను దిగమ్రింగి యింకా ఏదైనా చేతికి చిక్కుతుందేమోనని ఎదురు చూస్తున్నాడు రాఘవయ్య. తర్వాత మరెవ్వరు పడాల్సి యున్నదో ఆ గోతిలో!

—(౦)—

మెదడును చల్లబరచి
శిరోజములను నల్లబరచి
కుదుళ్లను పదిలము చేయునది

కేసరిగారి

భృంగామలకతైలము

వెల రు. 2

కేసరి కుటీరం ప్రైవేటు లిమిటెడ్

రాయపేట, మద్రాసు 14.